
కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామ్మూర్తి

## పోలింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలి

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 2 : ఎన్నికల ముందే రోజే పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రామ్మూర్తి సూచించారు. గురువారం డివిజన్ కేంద్రంలోని రైతు వేదికలో నియోజకవర్గస్థాయి పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికలు సజావుగా సాగడానికి, తీసుకోవాల్సిన ఏర్పాట్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ముందు రోజు పోలింగ్ బూత్ కన్వీనర్లను, క్లష్టర్ ఇన్‌చార్జిలను, అంగన్‌వాడీ టీచర్లను కలవాలని, పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లతో పాటు పోలింగ్ కేంద్రం పరిసరాల్లో ఎన్నికల నిబంధనల మేరకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. శుక్రవారం నుంచి ఎన్నికల నామినేషన్ ప్రారంభమవుతుంది, కాగా, గ్రామాల్లో, పోలింగ్ బూతుల వద్ద అనుమతులు లేకుండా వివిధ పార్టీలకు చెందిన బ్యానర్లు, వాల్ రైటింగ్ ఉండకూడదని, ఎన్నికల అబ్జర్వర్లు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తారు కాబట్టి ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆర్డీవో సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో వసంత, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీఎల్‌పీవో వెంకటప్రసాద్, స్టేషన్ ఘన్‌పూర్ ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీధర్ స్వామి, జఫర్‌గఢ్ డిప్యూటీ తహసీల్దార్ హరి ప్రసాద్, స్టేషన్‌ఘన్‌పూర్, లింగాల ఘన్‌పూర్ మండలాల ఎంపీవోలు సుధీర్ కుమార్, మల్లికార్జున్, కార్యదర్శులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన..

జఫర్‌గఢ్, నవంబర్ 2 : మండలంలోని సాగరంలో పోలింగ్ కేంద్రాలను ఎస్సై మహేందర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పోలింగ్ కేంద్రాల నంబర్ 259, 260 కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, గదులు, ఫ్యాన్లు ఇతరత్రా మౌలిక వసతులతో పాటు భద్రతా పరంగా ఉన్న అంశాలను ఆయన పరిశీలించారు. చెత్తా చెదారాన్ని తొలగించాలని సంబంధిత సిబ్బందికి తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కనుకరాజు, కారోబార్ రాజు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# కడియంను భారీ మెజార్టీతో గెలిపించాలి

- ఇంటింటా ప్రాచారం చేసిన నాయకులు, కార్యకర్తలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

లింగాలఘనపురం, నవంబర్ 2 : స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించాలని మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు గురువారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని వినాయక, శివాలయ, ఆంజనేయ స్వామి, పోచమ్మ తదితర ఆలయాలకు బీఆర్‌ఎస్ శ్రేణులు ర్యాలీగా వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మచ్చలేని కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి గవ్వల మల్లేశం, మండల మాజీ అధ్యక్షుడు ఏదునూరి వీరన్న, గ్రామ అధ్యక్షుడు కేమిడి యాదగిరి, విండో అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు కేమిడి కవితావెంకటేష్, కారంపురి చంద్రయ్య, ఎడ్ల రాజు, బోయిని జంపయ్య, బింగి స్వామి, వేముల శ్రీనివాస్, బెజ్జం చంద్రయ్య, ఆకుల రవి, దేవయ్య, వంగ జనార్దన్, రవి, సత్యనారాయణ, బోయిని శ్రీనివాస్, ఎండీ జానీమియా, చొక్కమ్మ, శ్రీహరి, వెంకటేశ్, నర్సయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

### కడియం శ్రీహరికి మార్బుల్, టైల్స్ వర్కింగ్ యూనియన్ సంపూర్ణ మద్దతు

చిల్పూరు : స్టేషన్‌ఘనపూర్ నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని మార్బుల్, టైల్స్ వర్కింగ్ యూనియన్ సంఘం నాయకులు తెలిపారు. గురువారం హనుమకొండలో కడియం శ్రీహరిని ఎంపీటీసీ అంజయ్ రెడ్డి, మాజీ సర్పంచ్ భూక్యా సుధాకర్, ఆధ్వర్యంలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం మార్బుల్, టైల్స్ వర్కింగ్ యూనియన్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఎన్నికల్లో కడియం శ్రీహరికి మద్దతు తెలిపి విజయం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్బుల్, టైల్స్ వర్కింగ్ యూనియన్ అధ్యక్షుడు గిరు రాజు, ఉపాధ్యక్షుడు రమణాకర్, రాజు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.


చిల్పూరు : కడియం శ్రీహరితో మార్బుల్స్, టైల్స్ వర్కింగ్ యూనియన్ నాయకులు


లింగాలఘనపురం : పోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

### కడియం శ్రీహరికే మద్దతు..

జఫర్‌గఢ్ : బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరికే తాము మద్దతు తెలుపుతున్నట్లు మాదిగ రాజకీయ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటికాయల చిరంజీవి అన్నారు. జఫర్‌గఢ్‌లో గురువారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గాదెపాక నాగరాజుతో కలిసి ముఖ్య నాయకుల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా చిరంజీవి, నాగరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాజకీయ పోరాట సమితి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. జఫర్‌గఢ్ మండల కేంద్రంలో ఈ నెల 4న కడియం శ్రీహరికి మద్దతుగా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. మండలంలోని దళిత నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, శ్రేణులు అందరూ జఫర్‌గఢ్‌లో నిర్వహించనున్న సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరై కడియం శ్రీహరికి మద్దతు తెలుపుదామని చిరంజీవి, నాగరాజు కోరారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాటికాయల సంపత్, జఫర్‌గఢ్ మాజీ ఎంపీటీసీ తాటికాయల ఎల్లయ్య, బండ్ల సుదర్శనం, నర్సింగం, ఏలియా, బక్కయ్య, ఎల్లయ్య, బొజ్జ సోమయ్య, నర్సింగం, యాదయ్య, బండ్ల సోమయ్య, మారపల్లి కొమురయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

# బీఆర్‌ఎస్‌కు పెరుగుతున్న ఆదరణ

**కాంగ్రెస్ వ్యవహారాన్ని ఛీ కొడుతున్న ప్రజలు**

లింగాలఘనపురం; నవంబర్ 2: రోజు రోజుకూ మండలంలో బీఆర్‌ఎస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్ నాయకులు అక్కసు తీర్చుకుందామని అబాసుపాలయ్యారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చే పడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువకులు కడియం నివాసానికి బారులు తీరారు. స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఇందిరా ఒంటెద్దు పోకడలకు ఆ పార్టీని పలువురు వీడి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. సిరిపురానికి చెందిన కాంగ్రెస్ ఎంపీటీసీ బీ మాధవికుమార్ ఇందిర వ్యవహారాన్ని విబేధించి జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కడియం శ్రీహరి సమక్షంలో వివిధ గ్రామాలకు చెందిన తన అనుయాయులతో బీఆర్‌ఎస్‌లో చేరారు. దీన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు సుదీర్ఘ మంతనాలు చేసి ఆత్మతగా లింగాలఘనపురంలో బీఆర్‌ఎస్‌లో కొ నసాగుతున్న హమాలీయూనియన్ నాయకులను మభ్య పెట్టారు. గోదాములకు కిలో మీటరు దూరంలో ఉన్న కాంగ్రెస్ నాయకుడికి చెందిన ఫంక్షన్ హాల్‌లో దావత్ ఉందంటూ తీసుకెళ్లారు. చకచకా కండువాలు కప్పి యూనియన్ నాయకులందరూ తమ పార్టీలో చేరారంటూ హుటాహుటిన మీడియాను పిలిచి ఫోటోలను, వీడియోలను అందించారు. మీడియా రాకను గమనించిన యూనియన్ నాయకులు మరుక్షణం తేరుకుని తామసలు కాంగ్రెస్‌లో చేరలేదంటూ, ఆ నాయకులపై తిట్ల వర్షం కురిపించడంతో మీడియాతో పాటు, అక్కడి ఉన్న జనం.. కాంగ్రెస్ నేతలే కలవరానికి గురయ్యారు. ఆ నాయకులంతా మీడియా సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేసి తాము బీఆర్‌ఎస్‌ను వీడే ప్రసక్తే లేదని వివరణ ఇచ్చుకోవాల్సి రావడంపై కాంగ్రెస్‌ను ప్రజలు ఛీ కొడుతున్నారు.


బీఆర్‌ఎస్‌లోనే ఉన్నామంటున్నా యూనియన్ నాయకులు

## బీఆర్‌ఎస్ ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా వంశీధర్

లింగాలఘనపురం, నవంబర్ 2: బీఆర్‌ఎస్ లింగాలఘనపురం మండల ఎన్నికల సమన్వయ కమిటీ కన్వీనర్‌గా జడ్పీటీసీ గుడి వంశీధర్‌ను నియమిస్తూ స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి గురు వారం ఉత్తర్వులు జారీ చేశారు. చిల్పూరు మండల కన్వీనర్‌గా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, జడ్పీచైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, వేలేరుకు బీఆర్‌ఎస్ మండలా ధ్యక్షుడు ఎం నరసింగరావు, స్టేషన్‌ఘన్‌పూర్‌కు పోగుల సారంగపాణి, దర్మసాగర్‌కు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మునిగల రాజు, జఫర్‌గఢ్‌కు పీఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, రఘునాథపల్లికి మాజీ జడ్పీటీసీ రాంబాబును నియమిస్తూ కడియం శ్రీహరి ఉత్తర్వులు జారీ చేశారు.

# మోసం చేసిన బీజేపీ, కాంగ్రెస్

- ఎన్నికలప్పుడు వచ్చే వారికే టికెట్లు
- ఆరేళ్లు రెండు పార్టీలకు సేవ చేసినా గుర్తింపు లేదు
- బీజేపీకి రాజీనామా చేసిన రాష్ట్ర నేత మాదాసు వెంకటేష్
- బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సన్నాహాలు ?

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 2 : సామాజిక సేవే బాధ్యతగా రాజకీయంలోకి వచ్చిన నేను కొన ఊపిరితో ఉన్న జాతీయ పార్టీలు అని చెప్పుకునే కాంగ్రెస్, బీజేపీలను బతికించిన నన్ను ఆ రెండు పార్టీలు మోసం చేశాయని, బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని, మళ్లీ ఆ పార్టీ కండువా కప్పుకోనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు వెంకటేష్ అన్నారు. గురువారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సామాజిక సేవే బాధ్యతగా 2018లో కాంగ్రెస్‌లో చేరి, చావు బతుకుల్లో ఉన్న ఆ పార్టీని బతికించానన్నారు. 2018 ఎన్నికల్లో ఢిల్లీలో మంతనాలు జరిపిన ఇందిర కాంగ్రెస్ టికెట్ తెచ్చుకుందని, అనంతరం ఓడిపోయిన ఇందిర మళ్లీ ఎన్నికలప్పుడే నియోజకవర్గంలో ప్రత్యక్షం అవుతుందన్నారు. 2019లో బీజేపీలో ఆ పార్టీకి ఊపిరి పోశానన్నారు. సుమారు రూ. కోటి యాభై లక్షలు పార్టీకీ, ఈ నియోజకవర్గ ప్రజలకు ఖర్చు చేశానని, ఈ నియోజకవర్గంలో బీజేపీ సంగ్రామ యాత్రను విజయవంతం చేశానన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 3500 మందికి ఆర్థిక సాయం చేసి, పార్టీకి, తనకు ఓ గుర్తింపు తీసుకువచ్చానన్నారు. ఈ సారి బీజేపీ నుంచి నాకు టికెట్ కచ్చితంగా వస్తుందని అనుకున్నానని, మాజీ మంత్రి జీవీఆర్‌కు ఏం చూసి టికెట్ ఇచ్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ఢిల్లీలో ఏం జరుగుతుందో తెలియదన్నారు. టికెట్ ఇచ్చే ముందు మండల నాయకులను కానీ, తనని కానీ సంప్రదించ లేదన్నారు. నిత్యం నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ, కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ పార్టీలను బతికిస్తే గుర్తింపు లేదని, గెలిచే వారికి కాకుండా, ప్రజల కష్ట సుఖాలు పట్టించుకోని, ఎన్నికలప్పుడే నియోజకవర్గానికి వచ్చే నాయకులకు మాత్రమే టికెట్ ఇస్తారని గ్రహించానని, అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. తదుపరి కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తానని తెలిపారు.

**బీఆర్‌ఎస్ వైపు మాదాసు చూపు..**

ప్రజలకు , పార్టీలకు పనిచేసే నాయకులను, కార్యకర్తలను గుర్తించే బీఆర్‌ఎస్ పార్టీలో చేరేదుకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు వెంకటేష్ సుముఖంగా ఉన్నట్లు ఆయన సన్నిహితుల ద్వారా తెలిసింది. జాతీయ పార్టీలు అంటే గొప్ప గా ఉంటాయని, అనుకుని ఆ పార్టీలను నమ్ముకుని కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని గ్రహించి, త్వరలోనే బీఆర్‌ఎస్ కండువా కప్పుకునే అవకాశం ఉందని సమాచారం.. ఈ సమావేశంలో ఏదునూరి నాగరాజు, లింగాల ఆదిత్య, కనకం ప్రవీన్, మాడిశెట్టి మహేందర్, బజ్జూరి రవీందర్, కనకం సంపత్, రడపాక శ్రీనివాస్, రడపాక రాజుకుమార్, ఆమంచ రవీందర్, చెరిపల్లి త్రిశాల్, చింతల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రేణుక కుటుంబానికి ఆర్టిస్ట్ చేయూత

లింగాలఘనపురం, నవంబర్ 2: మండలంలోని నెల్లుట్లకు చెందిన పేద కుటుంబానికి జబర్దస్త్ టీం ఆర్టిస్ట్ నూకరాజు గురువారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి చేయూత నిచ్చారు. నెల్లుట్లకు చెందిన నానపురం రేణుక కూరగాయల వ్యాపారం నిర్వహించేందుకు నూకరాజు ఆర్థిక చేయూతనందించారు. నల్ల సుధీర్, నల్ల రాహుల్, నల్ల విజయ్, విల్సన్, సంపత్, కరుణాకర్, కమలాకర్, శ్రీను పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

లింగాలఘనపురం, నవంబర్ 2 : కళ్లెం విండో ఆధ్వర్యంలో కళ్లెం, సిరిపురం, గుమ్మడవెల్లి, మాణిక్యపురంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీవో రాజేందర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ముంగిట్లోకే వెళ్లి ధాన్యంను కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏఆర్(అసిస్టెంట్ రిజిస్ట్రార్) శంకర్‌నాయక్, ఏఈవో వెన్నెల, సీఈవో మల్లేశం పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీవో రాజేందర్‌రెడ్డి